

యోగాతో ఆరోగ్యం

అనకాపల్లిటౌన్: ఆరోగ్య జీవితానికి యోగా చేయాలని మౌంట్ అబూ ప్రతినిధి బన్సిలాల్ సాహు అన్నారు. ఎన్టీఆర్ ఆస్పత్రిలో మాట్లాడారు.



పంచాయతీలకు ఆదాయం

దేవరాపల్లి: సంపద కేంద్రాల్లో ఎరువుల తయారీతో పంచాయతీలకు ఆదాయం లభిస్తుందని జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి తెలిపారు.

వాతావరణం

అనకాపల్లిటౌన్: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త ఎంజీబీఎస్ కుమారి తెలిపారు. ఉష్ణోగ్రతలు 31 నుంచి 32.7 డిగ్రీలు, గాలిలో తేమశాతం 66 నుంచి 69, గాలి గంటకు 3 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

19 మంది ఉపాధ్యాయులకు మెమోలు



ఒమ్మలి హైస్కూల్‌లో పరీక్ష పేపర్లు, రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో ప్రేమకుమార్

మాడుగుల: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కింతలి, ఒమ్మలి ఉన్నతపాఠశాలలకు చెందిన మొత్తం 19 మంది ఉపాధ్యాయులకు ఉప విద్యాశాఖాధికారి ప్రేమకుమార్ శుక్రవారం మెమోలు జారీ చేశారు. మండలంలోని ఈ రెండు పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కింతలి హైస్కూల్‌లో విద్యార్థులు రాసిన పరీక్ష పేపర్లు సక్రమంగా వ్యాల్యూషన్ చేయని హెచ్‌ఎం, మరో 15 ఉపాధ్యాయులకు, ఒమ్మలి జిల్లాపరిషత్ హైస్కూల్‌లో నోట్స్, వర్క్‌బుక్స్, రికార్డులు సక్రమంగా లేకపోడంతో ముగ్గురు ఉపాధ్యాయులకు మెమోలు ఇచ్చారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విద్యాబోధనతో పాటు, మధ్యాహ్న భోజన పథకం, పరీక్షలు వేల్యూషన్ లేకపోతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. డిప్యూటీ డీఈవో వెంట ఎంఈవో బి.దేముడమ్మ ఉన్నారు.

సురక్షితమైన డ్రైవింగ్‌పై దృష్టి

- జిల్లా ప్రజా రవాణా అధికారి పద్మావతి



సమావేశంలో మాట్లాడుతున్న పద్మావతి

నర్సీపట్నం: ఏకాగ్రతతో వాహనాలు నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి కె.పద్మావతి తెలిపారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఆర్టీసీ డ్రైవర్లు సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని సూచించారు. అనంతరం ఎస్‌ఐ గోవిందరావు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు, జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సమావేశంలో డిపో మేనేజర్ ధీరజ్, డ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

'తానా' పుస్తకంలో చంటిబాబు కార్టూన్లు





అంబటి చంటిబాబు (కార్టూనిస్టు)

నాతవరం: తెలుగు భాషా సంస్కృతి అనే అంశంపై తానా ప్రపంచ సాహిత్యవేదిక ఆధ్వర్యంలో రూపొందించిన కార్టూన్ల పుస్తకంలో నాతవరం మండలం చమ్మచింత గ్రామానికి చెందిన అంబటి చంటిబాబు వేసిన కార్టూన్లకు స్థానం లభించింది. ఆయన జిల్లేడుపూడి పంచాయతీ శివారు ఆర్.వెంకయ్యపాలెం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈనెలలో అమెరికాలో తానా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో కార్టూన్ పోటీలు నిర్వహించారు. ఈపోటీలకు చంటిబాబు పంపిన కార్టూన్లలో రెండు కార్టూన్లు ఎంపిక చేశారు. ఈరెంటిండినీ అంతర్జాతీయ స్థాయిలో తానా సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన పుస్తకంలో ప్రచురించారు. ఈపుస్తకాన్ని విజయవాడలో హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్ తానా సంస్థ ప్రతినిధుల సమక్షంలో ఆవిష్కరించారు. దీనిని స్థానిక సర్వోత్తమ గ్రంథాలయంలో ఏర్పాటు చేశారు. గతంలో చంటిబాబు రచయితగా, కార్టునిస్టుగా దేశ, రాష్ట్ర స్థాయిల్లో పలు అవార్డులు అందుకున్నారు.

సారా నిర్మూలనకు చర్యలు

నర్సీపట్నం: సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఆపరేషన్ పరివర్తన వల్ల జిల్లాలో సారా ప్రభావం తగ్గిందని అనకాపల్లి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. శుక్రవా రం నర్సీపట్నం వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పాయకరావుపేట లో సారా ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. కాకినాడ జిల్లా నుంచి పాయకరావుపేటకు సారా తీసుకొస్తున్నారని చెప్పారు. సారాను అరికట్టేందుకు పాయకరావుపేటలో ప్రత్యేక సిబ్బందితో మొబైల్ టీమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలోని ఎనిమిది ఎస్‌ఈబీ స్టేషన్లలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 200 వాహనాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం వేశామన్నారు. మరో 225 వాహనాలను మార్చి నెలాఖారుకు వేలం వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

జాతీయ రహదారితో పాటు, గ్రామీణ రహదారుల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఒక వైపు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించడమే కాకుండా మరో వైపు వాహన చోదకులకు అవగాహన కల్పిస్తోంది. వీటిలో అన్నివర్గాల వారిని భాగస్వాములను చేస్తోంది.

భద్రం.. బ్రదరూ

- రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు
- యమధర్మరాజు వేషధారణతో వాహన చోదకులకు అవగాహన
- తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే 37 బ్లాక్ స్పాట్లు గుర్తింపు



వేంపాడు టోల్‌ప్లాజా వద్ద యమధర్మరాజు వేషధారణతో వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నక్కపల్లి: జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిలో కొందరు మృత్యువాత పడుతుండగా మరికొందరు తీవ్ర గాయాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. మద్యం సేవించడం, విశ్రాంతి లేకుండా డ్రైవింగ్, అవగాహన లోపం, అనుభవంలేని వారికి వాహనాలు ఇవ్వడం, మితిమీరిన వేగంతో ప్రయాణం తదితర అంశాలు ఇందుకు కారణాలుగా నిలుస్తున్నాయి.

జాతీయ రహదారిపైనే..

జాతీయరహదారిపైనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి రాకపోకలు సాగించడం వల్ల డ్రైవింగ్ చేసే సమయంలో ఇబ్బందులు ఏర్పడి ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

గత రెండేళ్లలో..

గత రెండేళ్లలో జిల్లాలో జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే.. 2020 జనవరి నుంచి 2022 మే వరకు 1767 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వీటిలో నేషనల్ హైవేపై 737, స్టేట్ హైవేపై 699 ఇతర రహదారులపై 331 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. జాతీయరహదారిపై ఒకే ప్రాంతంలో ఎనిమిది రోడ్డు ప్రమాదాలకు మించి జరిగిన 37 హాట్ స్పాట్లను (బ్లాక్ స్పాట్లను) అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో 382 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. సరైన అవగాహన కల్పించి ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రభుత్వం రహదారి భద్రత వారోత్సవాలను నిర్వహిస్తోంది.

రోడ్డుపై యమధర్మరాజు

వారోత్సవాల్లో భాగంగా వేంపాడు టోల్‌ప్లాజా సిబ్బంది రహదారి భద్రత, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పించేందుకు వినూత్నంగా ప్రచారం చేపట్టారు. ఇద్దరు వ్యక్తులను జగ్గంపేట ప్రాంతం నుంచి తీసుకు వచ్చిన వారికి యమధర్మరాజు, చిత్రగుప్తుని వేషం వేయించారు.



యమధర్మరాజు, చిత్రగుప్తుల వేషధారులతో టోల్‌ప్లాజా సిబ్బంది

- హెల్మెట్ లేకుండా వాహనం నడిపినా ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి నడిపినా, కారులో సీటు బెల్టు పెట్టుకోకుండా డ్రైవింగ్ చేసినా, పరిమితికి మించి వేగంతో వాహనం నడిపినా ప్రమాదాలు జరిగి, ప్రాణాలు పోతాయని, యమలోకానికి చేరుకుంటారని, ప్రమాదాలు సంభవించే ప్రాంతంలో యమభటులు కాచుకుని ఉంటారంటూ వినూత్నంగా నిర్వహించిన ప్రచారం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా టోల్‌ప్లాజా మేనేజర్ చిరంజీవినాయుడు మాట్లాడుతూ వాహన చోదకులు కూడా ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని కోరారు.

స్పీడ్ గన్‌లతో వేగం పరిశీలన

చాలా వరకు ప్రమాదాలు అవగాహన లోపం, నిర్లక్ష్యం వల్ల సంభవిస్తున్నాయని జిల్లా రవాణా శాఖాధికారి రాజబాబు తెలిపారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే 37 బ్లాక్ స్పాట్లు గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు ఆయన వివరించారు. స్పీడ్‌గన్‌లు కూడా ఏర్పాటు చేసి వేగాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. హైవేపై పెట్రోలింగ్ వాహనాలు ఏర్పాటు చేసి పరిమితికి మించి వేగంతో వెళ్లేవారిని కట్టడి చేసే చర్యలు కూడా చేపడుతున్నామన్నారు. వాహన చోదకులు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఆయన కోరారు.

– రాజబాబు, జిల్లా రవాణాశాఖ అధికారి

నేడు గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఉత్సవం



అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెంలో శనివారం గౌరీపరమేశ్వరుల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు శుక్రవారం తెలిపారు. ఈ ఉత్సవంలో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని ఆయన చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి అమ్మవారిని ఊరేగించనున్నట్టు తెలిపారు. భారీ ఎత్తున సాంస్కృతి కార్యక్రమాలు, రాత్రి 12 గంటలకు అనకాపల్లి మందుగుండు సీతారామయ్య బృందంతో భారీ బాణసంచా విన్యాసాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు పట్టణ సీఐ దాడి మోహనరావు తెలిపారు. అనకాపల్లి డీఎస్పీ బి.సునీల్ పర్యవేక్షణలో ఏడుగురు సీఐలు, 30 మంది ఎస్‌ఐలు, 59 మంది ఏఎస్‌ఐలు, హెచ్‌సీలు, 80 మంది కానిస్టేబుళ్లు, 38 మంది స్పెషల్ ఏఆర్ పోలీసులు, 65 మంది హోమ్‌గార్డులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ఊపందుకున్న ధాన్యం కొనుగోళ్లు

- జిల్లా వ్యాప్తంగా 32 వేల టన్నుల కొనుగోలుకు నిధుల విడుదల
- ఇంత వరకు 12,000 టన్నుల సేకరణ
- వచ్చేనెల 15 వరకు కేంద్రాల కొనసాగింపు



సత్యవరంలో విక్రయానికి సిద్ధం చేసిన ధాన్యం

మాడుగుల: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు జోరందుకున్నాయి. 380 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 78 క్లస్టర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని వచ్చేనెల 15వ తేదీ వరకు కొనసాగించనున్నారు. టన్నుకు ఏ గ్రేడ్ రకానికి రూ.20,600, సాధారణ రకానికి రూ.20,400 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంతో పాటు 21 రోజుల్లో పేమెంట్ నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 32 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి.

అనకాపల్లి డివిజన్‌లో 5,500 టన్నులు, నర్సీపట్నం డివిజన్‌లో 6,501 చొప్పున కొనుగోలు చేశారు.ఇంత వరకు 12 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు సకాలంలో చెల్లింపులు చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మేలు రకం ధాన్యానికి టన్నుకు రూ.16 వేల నుంచి రూ.17 వేల వరకు మాత్రమే దళారులు చెల్లించడం పేమెంట్స్ ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి ఏర్పడడంతో ఈ ఏడాది రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారు. గతంలో 1.70 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, ఈ సారి ఖరీఫ్‌లో సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరిగింది. జిల్లాల్లోని అనకాపల్లి, నర్సీపట్నం వ్యవసాయ డివిజన్ల పరిధిలో మొత్తం 2.55 లక్షల టన్నుల వరి దిగుబడి అయింది. చెరకు రైతులు కూడా వరి సాగుపై మొగ్గ చూపారు.

వాహన అద్దె, గోనె సంచుల రాయితీ

ధాన్యం నూర్పిడి చేసిన వెంటనే రెండు రోజులు పొలంలోనే ఆరబెట్టి, ఆర్‌బీకే అధికారులకు తెలియజేస్తే వారు టోకెన్లు అందజేస్తున్నారు. అనంతరం కేటాయించిన మిల్లుకు సరఫరా ట్రాక్టరుతో తరలిస్తున్నారు. వాహన అద్దెతో పాటు గోనె సంచులు రాయితీ కూడా ప్రభుత్వమే భరిస్తోంది.

21 రోజుల్లో చెల్లింపు



గతంలో ధాన్యానికి తగిన మద్దతు ధర లేకపోవడంతో ఇబ్బందులు పడేవారం. ప్రస్తుతం ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు విక్రయించడం ద్వారా మంచి మద్దతు ధర పొందడంతో పాటు, 21 రోజుల్లో బ్యాంకు ఖాతాలకు పేమెంట్స్ జమ అవుతున్నాయి. చెరకు పంటకు సక్రమంగా పేమెంట్స్ రాకపోడంతో వరిపై దృష్టి సారించాం.

-బియ్యపు అప్పారావు, రైతు, సత్యవరం

లక్ష్యం పూర్తి చేస్తాం

జిల్లాలో 32 వేల టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి. ఇప్పటికే 12 వేల టన్నులు సేకరించాం. గత ఏడాది కంటే ఈ ఏడాది వరి సాగు పెరిగింది. ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా అందిస్తున్న రాయితీలను ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలి.

– బి.మోహనరావు, జిల్లా వ్యవసాయాధికారి

రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు

- నేటి తెల్లవారు జాము నుంచి రాజుపాలెంలో పూజలు, దర్శనాలు
- భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమిసాలి

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణమూర్తి ఆలయంలో రథసప్తమి వేడుకలు శనివారం తెల్లవారు జాము నుంచి అత్యంత వైభంగా నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు తెలిపారు. ఆలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సుమారు లక్షమంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని ఆయన చెప్పారు. రథసప్తమి సందర్భంగా సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, స్టేజ్ ప్రోగ్రాంలు, నేలవేషాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రాత్రి 9 గంటలకు అనకాపల్లి మందుగుండు సీతారామయ్య గారి బృందం బాణసంచా విన్యాసాలు ఉంటాయని తెలిపారు.

స్వామిని దర్శించుకున్న ఎస్పీ గౌతమిసాలి

రాజుపాలెంలో సూర్యనారాయణమూర్తిని ఎస్పీ గౌతమి సాలి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు ఆమెను దుశ్శాలువాతో సత్కరించి, పట్టుచీర, స్వామివారి విగ్రహం అందజేశారు. అంతకు ముందు భక్తులకోసం ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన మండపాలను ఆమె తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషినల్ ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్, అనకాపల్లి డీఎస్పీ బి.సునీల్, రూరల్ సీఐ రవికుమార్, ఎస్‌ఐలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సకాలంలో కేసుల పరిష్కారం

- నేర సమీక్షలో ఎస్పీ గౌతమి సాలి



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమి సాలి

అనకాపల్లిటౌన్: పోక్సో కేసులు, స్పందన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించడంతో పాటు, వచ్చే నెల 11న జరిగే మెగా లోక్ అదాలత్‌లో దర్యాప్తులో ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ గౌతమి సాలి ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలను నివారించడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని, మనతోటి వారిని దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడపాలన్నారు. అధిక ప్రమాదాలు ద్విచక్రవాహనాల వల్ల జరుగుతున్నాయని ఆమె తెలిపారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ప్రమాదాల్లో ఎంతో మంది మరణిస్తున్నారని, కొంత మంది శాశ్వత అంగవైకల్యం కలిగి జీవితాంతం ఇతరులపై ఆధారపడవలసి వస్తోందని చెప్పారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్టు ఆమె తెలిపారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో లైటింగ్, వేగ నియంత్రణలు, సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లతో ఉన్న డ్రమ్ములను ఏర్పాటు చేయాలని, ఎన్‌హెచ్ 16లో అనధికార మార్గాలను మూయించే విధంగా సంబంధిత శాఖలతో చర్చించాలని ఆమె సూచించారు. వచ్చే నెల 11న జరిగే మెగా లోక్ అదాలత్‌లో కేసుల్లో ఇరు పార్టీలను పిలిచి కౌన్సెలింగ్ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్, డీఎస్పీలు పి.శ్రీనివాసరావు, బి.సునీల్, మళ్ల మహేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు దాడి మోహనరావు, తాతారావు, చంద్రశేఖర్, లక్ష్మణ్‌మూర్తి, అప్పలనాయుడు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పరిశ్రమల అభివృద్ధికి చర్యలు

- మత్తు పదార్థాలు బాలల దరిదాపుల్లో ఉండరాదు
- కుష్టు వ్యాధి నివారణకు అవగాహన కార్యక్రమాలు
- వేర్వేరు సమావేశాల్లో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న సమస్యలు ఉత్పన్నమైనప్పుడు వాటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. అచ్యుతాపురం ఇండస్ట్రియల్ ప్రాంతానికి సంబంధించి ఆస్పత్రి నిర్మాణానికి ఎకరా స్థలాన్ని మంజూరు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఆ ఆస్పత్రిని ఇండస్ట్రియల్ అసోసియేషన్ నిర్మిస్తుందని చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా త్వరితగతిన వారికి స్థలాలు కేటాయించాలని సూచించారు.

మత్తు పదార్థాలపై ప్రత్యేక చర్యలు

బాలలపై మత్తు పదార్థాల ప్రభావం ఏ మాత్రం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలలు మత్తు పదార్థాలు, మత్తు పానీయాల వినియోగం, రవాణాకు పావులు కాకుడదన్నారు. అనాథలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, బాలలను మత్తుపదార్థాలకు, వ్యసనాలకు, అక్రమ రవాణాకు గురవకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, కుమారి, ఆదిలక్ష్మి, త్రిపర్ణలు కలెక్టర్‌ను కోరారు. అంతకు ముందు బాలల హక్కుల కమిషన్ ప్రతినిధులు పట్టణంలోని ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లలో పర్యటించి రెండో శనివారం, ఆదివారం, పండగ రోజులు తప్పక సెలవులు పాటించాలని సూచించారు. నోటీస్ బోర్డులో ఫీజు వివరాలను తెలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు.



బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి

అవగాహనతోనే కుష్టు వ్యాధి నివారణ

ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు జాతీయ కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమం కింద అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి లక్షణాలను ప్రజలకు తెలిసేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో హేమంత్, అదనపు డీఎంహెచ్‌వో శారదాబాయి, డీఎల్‌డీవో మంజులవాణి, బీపీఎంవో కిషోర్, బీహెచ్‌ఈవో ఝాన్సీ, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశంలో జేసీ కల్పనాకుమారి, అదనపు ఎస్పీ విజయభాస్కర్, జిల్లా ఎక్సైజ్ అధికారి వి.రమణ, విద్యాశాఖ ఏడీ రవిబాబు, అధికారులు శకుంతలా, శంకరరావు, జిల్లా ఔషధ నియంత్రణ అధికారి వి.అభిప్రియ, పారిశ్రామిక ప్రోత్సాహక సమావేశంలో డీఆర్వో పి.వెంకటరమణ, ఎండీఐసీ శ్రీధర్, ఏపీఐఐసీ కె.త్రినాథ్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్, విద్యుత్ శాఖ ఈఈ కె.రమణమూర్తి, ఎల్‌డీఎం సత్యనారాయణ, పీసీబీ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, డీపీవో శిరీషారాణి పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న 'స్థానిక' పదవుల ఎన్నికలకు నోటిఫికేషన్

మహారాణిపేట (విశాఖ దక్షిణ): అనకాపల్లి జిల్లాలో ఖాళీగాఉన్న స్థానిక సంస్థల పదవుల ఎన్నికలకు ఏపీ స్టేట్ ఎన్నికల కమిషన్ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 30న స్థానికంగా నోటిఫికేషన్ జారీ కానుంది. ఫిబ్రవరి 3న ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్.రాయవరం మండల పరిషత్ అధ్యక్ష, పాయకరావుపేట రెండో ఉపాధ్యక్ష , కోటవురట్ల మండల కోఆప్షన్‌పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు.



చోరీ కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్టు

- 5 తులాల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం
- మిగతా సొత్తు రికవరీ చేస్తాం: క్రైమ్ అదనపు ఎస్పీ సత్యనారాయణ



రికవరీ చేసిన బంగారం, వెండి ఆభరణాలు చూపుతున్న అనకాపల్లి క్రైమ్ అదనపు ఎస్పీ సత్యనారాయణ, డీఎస్పీ సునీల్

చోడవరం: దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేయడంతోపాటు వారి నుంచి ఐదు తులాల బంగారు, 40 తులాల వెండి ఆభరణాలను చోడవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో అనకాపల్లి జిల్లా క్రైమ్ బ్రాంచ్ అడిషనల్ పోలీసు సూపరింటెండెంట్ బి. సత్యనారాయణ, లా అండ్ ఆర్డర్ డీఎస్పీ సునీల్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. చోడవరం లక్ష్మీపురం రోడ్డులో ఈ నెల 24వ తేదీన రాచకొండ శశాంక్‌భరత్ ఇంట్లో 13 తులాల బంగారు ఆభరణాలు, 50 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ పరిసరాల్లో చోడవరం పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. చోరీకి అలవాటు పడ్డ కంచరపాలెం గ్రామానికి చెందిన ప్రసాద్(25), నాయుడు (26) మోటారుసైకిల్‌పై అనుమానాస్పదంగా లక్ష్మీపురం రోడ్డులో శుక్రవారం సంచరిస్తుండగా, అప్పటికే మఫ్టీలో మాటువేసిన పోలీసులు వీరిని అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో ఇటీవల శశాంత్ భరత్ ఇంట్లో జరిగిన చోరీ దొంగలు వీరేనన్న విషయం బయట పడింది. నిందితుల నుంచి ఐదు తులాల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మిగతా 8 తులాల బంగారు ఆభరాలు, 10 తులాల వెండి సొత్తును త్వరలో రికవరీ చేస్తామని క్రైమ్ అదనపు ఎస్పీ తెలిపారు. నిందితులిద్దరినీ కోర్టుకు తరలించామన్నారు. చోడవరం సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ అప్పలనాయుడు, పోలీసు సిబ్బందిని ఏఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

టెన్నికాయిట్ పోటీల విజేతలకు బహుమతులు

తుమ్మపాల: 74వ గణతంత్ర వేడుకలు పురస్కరించుకుని రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో జరిగిన 35వ జాతీయ బాలబాలికల సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీల విజేతలకు శుక్రవారం రాత్రి బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా జాతీయ టెన్నికాయిట్ సమైక్య ప్రధాన కార్యదర్శి ఎ.యాదయ్య విచ్చేసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు కులమతాలకతీతంగా పోటీల్లో పాల్గొనడం వల్ల సంఘీభావం, సమానత్వం ఏర్పడతాయన్నారు. క్రీడాకారులకు తమవంతు సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. ఈ నెల 22న మొదలైన ఈ పోటీలు 26వ తేదీన ముగిశాయి. రాష్ట్ర అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.వి.సత్యనారాయణ, జాతీయ సమైక్య ఉపాధ్యక్షుడు సంజయ్‌సాహు, కోశాధికారి శ్రీకాంత్, కార్యదర్శి దినేష్‌కుమార్, ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కె.ఎం.నాయుడు, వ్యాయమ ఉపాధ్యాయులు జి.రాజు, జి.కనకారావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని షర్మిలను అభినందిస్తున్న హెచ్‌ఎం ఉమాశంకర్

దేవరాపల్లి: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో తెనుగుపూడి జిల్లా పరిషత్ విద్యార్థిని ఎస్. షర్మిల సత్తా చాటింది. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు కర్నూలులో ఈ పోటీలు జరిగాయి. అండర్-17 బాలికల విభాగంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విశాఖపట్నం జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ జట్టు తరఫున షర్మిల ఆడి విశేష ప్రతిభ కనబరిచింది. ఆమెకు తర్ఫీదునిచ్చిన పీడీ డి. నర్సింగరావును హెచ్‌ఎం వి. ఉమాశంకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఏటికొప్పాక కళలకు గుర్తింపు



పద్మశ్రీ అవార్డు గ్రహీత సి.వి.రాజును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సి.వి.రాజును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ నాయకులు

యలమంచిలి : హస్త కళల్లో సి.వి.రాజుకు పద్మశ్రీ పురస్కారం రావడం ద్వారా ఏటికొప్పాక గ్రామానికి అంతర్జాతీయ గుర్తింపు వచ్చిందని జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి రాము అన్నారు. శుక్రవారం ఏటికొప్పాక గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు కలిసి సి.వి.రాజును ఘనంగా దుశ్శాలువాతో సత్కరించారు. సమావేశంలో ఏటికొప్పాక గ్రామ సచివాలయ కన్వీనర్ వి.శ్రీనివాసరావు, వి.బంగారుబాబు,క జెడ్పీ హైస్కూల్ చైర్మన్ రమణ, ఎంపీపీ స్కూల్ కమిటీ చైర్మన్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ, నాగబాబు, నాగేశ్వరావు పాల్గొన్నారు.

బీజేపీ నేతల సత్కారం

ఏటికొప్పాక గ్రామానికి హస్త కళల ద్వారా జీవం పోసి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టిన ఘనత చింతలపాటి వెంకటపతిరాజుది అని ఎమ్మెల్సీ మాధవ్ అన్నారు. శుక్రవారం ఏటికొప్పాకలో సి.వి.రాజును ఆయన స్వగృహంలో ఎమ్మెల్సీ మాధవ్, జిల్లా బీజేపీ నేతలు ఆధ్వర్యంలో అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. యలమంచిలి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ సన్యాసినాయుడు, గొంతిన భక్తసాయిరాం తదితరులు పాల్గొన్నారు.

కారు.. బైక్ ఢీకొని ముగ్గురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన దుర్గాప్రసాద్

నర్సీపట్నం : మున్సిపాలిటీ పరిధి శారదనగర్ శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. రోలుగుంట మండలం, శరభవరం గ్రామానికి చెందిన ప్రసాద్, వి.దుర్గాప్రసాద్ స్నేహితుడి వివాహానికి బలిఘట్టం వచ్చారు. బలిఘట్టంకు చెందిన నితిన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై నర్సీపట్నం బయలుదేరారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీ కొట్టారు. ఈ సంఘటనలో ముగ్గురూ గాయపడ్డారు. నితిన్‌కు కాలు, చెయ్యి విరిగింది. మెరుగైన వైద్యం కోసం నితిన్‌ను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మిగిలిన ఇద్దరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రసాద్ ఐటీఐ, నితిన్ 9వ తరగతి చదువుతున్నారు. ఘటనపై టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

రైలు నుండి జారి పడి వ్యక్తి మృతి



రైలు నుండి జారి పడి మృతి చెందిన వ్యక్తి

పాయకరావుపేట : పట్టణంలో గల నాగరాజుపేటకు చెందిన పోకలకారి అనిల్‌కుమార్ (33) అనే వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు తుని రైల్వే పోలీసు ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫంక్షన్‌కు గుడివాడ వెళ్ళి తిరుగు ప్రయాణంలో రత్నాచల్ రైల్లో వస్తూ తుని రైల్వేస్టేషన్ సమీపాన గల హంసవరం వద్ద రైలు నుంచి జారిపడి అనిల్‌కుమార్ మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో లెక్చరర్

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ చైతన్య కళాశాలలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు కారణమైన లెక్చరర్‌ను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భీమిలి సీఐ లక్ష్మణమూర్తి తెలిపిన వివరాలివీ.. నీట్ ప్రిపరేషన్‌లో భాగంగా బుధవారం వారాంతపు పరీక్ష నిర్వహించారు. పరీక్షలో భాగంగా అనకాపల్లి జిల్లాకు చెందిన అనూష యాదవ్‌ను కెమిస్ట్రీ లెక్చరర్ లలిత విద్యార్థులందరి ముందు మందలించారు. ఈ నెపంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు అనూష సూసైడ్ నోట్‌లో లెక్చరర్ పేరు రాయడంతో.. ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మోదకొండమ్మ తీర్థ మహోత్సవం రేపు

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవమైన మోదకొండమ్మ తల్లి ఆలయం వద్ద ఆదివారం తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ సభ్యులంతా ఉత్సవ ఏర్పాట్లు నిమగ్నమయ్యారు.











క్లుప్తంగా

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

తుమ్మపాల : పట్టణంలోని గవరపాలెం శ్రీగౌరీపరమేశ్వరుల మహోత్సవ సందర్భంగా కొణతాల లక్ష్మీనారాయణ, సూర్యకళ దంపతుల జ్ఞాపకార్థం కుమారులు డాక్టర్ కొణతాల నగేష్, జగదీష్ ఆధ్వర్యంలో మళ్ల జగన్నాథం కల్యాణమండపంలో ఉచిత మెగా వైద్యశిబిరం శనివారం జరిగింది. అత్యాధునిక పరికరాలతో క్యాన్సర్ తదితర అన్ని రకాల వైద్యపరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు, ఓమ్ని ఆస్పత్రి డైరెక్టర్ టి.వెంకట రమణారెడ్డి, కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



నెహ్రూచౌక్‌లో ట్రాఫిక్ నిబంధనల స్టిక్కర్లు అంటిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రమేష్

అనకాపల్లిటౌన్ : ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్‌లు ధరించాలని ట్రాఫిక్ ఎస్ఐ జె.రమేష్ అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ రూల్స్ స్టిక్కర్లను శుక్రవారం అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల మీతో పాటు, ఇతర వాహనదారులు, పాదచారులకు ప్రాణహాని కలిగించే వారవుతారని తెలిపారు. ఆటో డ్రైవర్లు ఖాకీ చొక్కాలను తప్పని సరిగా ధరించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కిస్తే.. ప్రమాదాలు పెరిగే అవకాశాలున్నాయని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి వారి భవిష్యత్తును నాశనం చేయొద్దని హితవుపలికారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

సింహాచలం: పాడి పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్ధకశాఖ డివిజనల్ డైరెక్టర్ డాక్టర్ కరుణాకర్ సూచించారు. పెందుర్తి మండలం చింతగట్లలోని జెర్రిపోతులపాలెం రైతుభరోసా కేంద్రంలో పశు విజ్ఞానబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
సిందూరం	-సత్యనారాయణ స్క్రీన్-1
పఠాన్	-సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
పఠాన్	-పర్తిసాయి
వీరసింహారెడ్డి	-వెంకటేశ్వర
హంట్	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 12,006 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,530	4,300
మొదటి రకం	2,990	3,520
రెండో రకం	2,840	3,210
మూడో రకం	2,700	2,860

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు , బీ పాజిటివ్-12 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-13 యూనిట్లు, ఓ నెగిటివ్-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 458 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 432 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

సస్య రక్షణతో.. మామిడి సంరక్షణ

- మామిడిలో యాజమాన్య పద్ధతులతో మంచి దిగుబడి
- సకాలంలో సస్యరక్షణతో తేనెమంచు పురుగు నివారణ
- అనకాపల్లి నియోజకవర్గంలో 500 ఎకరాల్లో మామిడి తోటలు



పూతకొచ్చిన మామిడి



అనకాపల్లి పరిసరాల్లోని మామిడి తోటలు

అనకాపల్లిరూరల్: మామిడి పూత, పిందె దశలో యాజమాన్య పద్ధతులు పాటిస్తూ తగిన రక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. అనకాపల్లి, కశింకోట, మునగపాక మండలాల్లోని పలు గ్రామాల్లో మామిడి తోటల్లో అక్కడక్కడా పూత దశ వస్తోంది. మామిడిలో పూత అంతా ఒకే సారి రాదు. సాధారణంగా డిసెంబరు, జనవరి నెలల్లో ప్రారంభమై ఫిబ్రవరి వరకూ పూత వస్తుంది. మామిడి పంట సాగు చేసే రైతులు పూతకు ముందు, పూత దశలో సరైన సస్యరక్షణా చర్యలు తీసుకోవాలి. పూత నిలవడం చాలా వరకూ వాతావరణ పరిస్థితులు, రైతులు చేపట్టే యాజమాన్య పద్ధతులపైనే ఆధారపడి వుంటుంది.

పూత, పిందె బాగుండాలంటే..

జనవరి మొదటి వారంలో పూత వచ్చిన క్రమంలో ప్రతీ 10 నుంచి 15 రోజులకోసారి భూమిలో తేమను బట్టి క్రమం తప్పకుండా నీటి తడిని అందించాలి. చలి, మంచు వాతావరణం ఎక్కువగా వుంటే మొగ్గలు రావడం ఆలస్యమవుతుంది. ఈ పరిస్థితుల్లో మొగ్గలను ఉత్తేజపరిచేందుకు లీటరు నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్, 5 గ్రాముల యూరియా కలిపి, పై రెమ్మలు బాగా తడిసేలా పిచికారీ చేయాలి. ఇది పూత బాగా రావడానికి, పిందె కట్టడానికి, కాయ సైజులో నాణ్యతకు దోహద పడుతుంది.

బూడిద తెగులు సోకితే..

పూత దశలో బూడిద తెగులు సోకి పూత రాలిపోతుంటుంది. దీని నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల గంధకం కలిపి పిచికారీ చేయాలి. పూత దశలో తెగులు ఆశిస్తే హెక్సాకొనజోన్ 2.మి.లీ., లేదా ప్రొపికొనజోల్ 1.మి.లీ., లేదా డినోకాఫ్/ట్రైడిమాల్ఫ్ 1 మి.లీ మందు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆకుపచ్చ, నల్లమచ్చ నివారణకు

పొగమంచు, వర్షాలున్నప్పుడు ఆకుపచ్చ, పూత మాడు, నల్లమచ్చ తెగుళ్లు ఆశిస్తాయి. ఆకులపైన, పూత పైన నల్లని మచ్చలు ఏర్పడి, పూలగుత్తులు, పూలు మాడిపోతాయి. ఈ తెగులు నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పచ్చిపూత మీద 1 గ్రాము కార్బండజిమ్, ఒక గ్రాము థయోఫినేట్‌మిథైల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పిందె దశలో లీటరు నీటికి 2 గ్రాముల అంట్రాకాల్ కలిపి పిచికారీ చేయాలి.

తేనెమంచు పురుగు నివారణ ఇలా..

తేనెమంచు పురుగులు ఆశించి పంటకు తీవ్ర నష్టం కల్గిస్తాయి. తల్లీ పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులను, పూత కాండాలు, పూలు, లేత పిందెల నుంచి రసం పీల్చుతాయి. దీని వల్ల పూత మాడిపోయి, పిందెలు బలహీనపడి రాలిపోతాయి. ఈ పురుగు తేనెలాంటి తియ్యని పదార్థాన్ని విసర్జించడం వల్ల ఆకులు, కాండం, కాయలపై మసి పొర ఏర్పడుతుంది. వీటి నివారణకు పూత, మొగ్గ దశలో లీటరు నీటికి 1.మి.లీ డైక్లోరోఫాస్ లేదా 3 గ్రాముల కార్బోరిల్ కలిపి చెట్టంతా తడిసేలా పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుంది.

యాజమాన్య పద్ధతులతో మేలు



మామిడిలో సరైన సమయంలో యాజమాన్య పద్ధతులను జాగ్రత్తగా పాటించాలి. పూత నుంచి కాయ వరకూ 4 నెలల పాటు యాజమాన్య పద్ధతులు తప్పనిసరి. తేనె మంచు పురుగు నివారణతో పాటు, సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చు. రైతులకు ఏమైనా సందేహాలుంటే సంప్రదించవచ్చు.

– లావణ్య, ఉద్యానవన శాఖాధికారిణి, అనకాపల్లి

తన్నో ఆదిత్యః ప్రచోదయాత్



గవరపాలెంలో వేంచేసిన సూర్యనారాయణ స్వామి



రథసప్తమి వేడుకలకు సిద్ధమైన మారేడుపూడి అగ్రహారం ఆలయం

- నేడు రథసప్తమి
- సూర్యదేవాలయాల వద్ద సందడి

అనకాపల్లిటౌన్/అనకాపల్లిరూరల్ : సృష్టికి మూలం సూర్యుడు. విశ్వానికి కేంద్రం సూర్యుడు. భూమిపై జీవరాశులన్నీ సుభిక్షంగా ఉన్నాయంటే కారణం సూర్య భగవానుడు. అందుకే భానుడిని ప్రత్యక్షదైవం అంటారు. సూర్యారాధనకు అత్యుత్తమ రోజు మాఘమాసం శుక్లపక్షంలో వచ్చే సప్తమి. ఇదే రథసప్తమిగా ప్రతీతి. నిత్యం చేసే సూర్య నమస్కారం కంటే.. రెట్టింపు ఫలితం రథసప్తమి రోజు దక్కుతుందని పండితుల ఉవాచ. సౌర కుటుంబంలో అన్ని ప్రాణులకు జీవనాధారమైన సూర్యుడిని ఈ రోజు పూజిస్తే అప్పుల బాధలు, అనారోగ్యం, శత్రు భయం నశిస్తాయని విశ్వాసం. శనివారం రథసప్తమి వేడుకలకు పట్టణం, గ్రామాల్లోని సూర్యదేవాలయాలు, ప్రజలు సన్నద్ధమయ్యారు.

రథసప్తమి రోజు చేయాల్సినవి

- రథసప్తమి రోజు ప్రాతఃకాలాన నదీస్నానం, సూర్యోపాసన వలన మృత్యుభయం పోతుందని విశ్వాసం.
- జిల్లేడు ఆకుని అర్కపత్రం అంటారు. సూర్యునికి 'అర్కుడా'అని పేరు. అందుకే సూర్యునికి జిల్లేడు అంటే ఎంతో ఇష్టం. సూర్యుడి రథానికి ఉండే ఏడు గుర్రాలకు, ఏడు జన్మల్లో చేసిన పాపాలకు, ఏడురకాలైన వ్యాధులకు చిహ్నంగా 7 జిల్లేడు ఆకులు తలపై పెట్టుకుని స్నానమాచరిస్తారు.
- రథసప్తమి రోజున ఆవు నేతితో దీపారాధన చేస్తే ఆ ఇంటిలో అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు కలుగుతాయని నమ్మకం.
- రథసప్తమి రోజున సూర్యకిరణాలు పడే చోట, తూర్పు దిక్కున తులసికోట పక్కగా ఆవు పేడతో అలికి, దానిపై పిండితో పద్మం వేసి, పొయ్యి పెట్టి, సంక్రాంతి రోజున పెట్టిన పిడకలు, గొబ్బెమ్మలతో పొయ్యి వెలిగించి దాని మీద పాలు పొంగించడం సంప్రదాయం.
- అలా పొంగిన పాలల్లో కొత్తబియ్యం, బెల్లం, నెయ్యి, ఏలకులు వేసి పరమాన్నం తయారు చేస్తారు. తులసికోట వద్ద చిక్కుడు కాయలతో రథం చేసి, చిక్కుడాకులపై పరమాన్నం ఉంచి దేవుడికి నైవేద్యం సమర్పిస్తారు.

సూర్యదేవాలయాల్లో భారీ ఏర్పాట్లు

పట్టణంలో సుంకరమెట్ట జంక్షన్ శ్రీ సత్యనారాయణ స్వామి, సూర్యనారాయణమూర్తి దేవాలయంలో రథసప్తమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఆదినారాయణరెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. తెల్లవారు జాము నుంచే ఆలయానికి వచ్చే భక్తులకు స్వామి దర్శనం కల్పించేలా సన్నాహాలు చేశారు. గవరపాలెం, మారేడుపూడి అగ్రహారంలో ఉన్న సూర్యదేవాలయాల్లో కూడా రథసప్తమికి భారీగా ఏర్పాట్లు చేశారు.

ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి గాంచిన రాజుపాలెం సూర్య భగవానుని రథ సప్తమి వేడుకలకు గానూ భారీగా జనం రానున్న నేపథ్యంలో వాహనాలు రాకపోకలపై ఆంక్షలు విధించారు. అదే విధంగా స్వామి వారిని దర్శించుకునే భక్తులకు ఇబ్బందులు లేకుండా రాజుపాలెం బ్రహ్మాద్రిపై చలువ పందిళ్లు ఏర్పాట్లు చేశారు. జీవీఎంసీ పరిధిలోకి వచ్చే ఈ ఆలయానికి చేరుకునేందుకు మూడు మార్గాలు ఉన్నాయి. అదే విధంగా పట్టణ పరిధిలోని సుంకర మెట్ట సూర్యనారాయణ స్వామి వద్ద వేడుకల్ని ఘనంగా నిర్వహించనున్నారు. మూడు రోడ్ల కూడలిగా ఉండే ఈ ఆలయం వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

చింతామణి దత్తక్షేత్రంలో..

మండలంలో సిరసపల్లి చింతామణి దత్తక్షేత్రంలో శనివారం రథసప్తమిని పురస్కరించుకుని సూర్యనారాయణ స్వామికి క్షీరాభిషేకములు, అష్టోత్తర శతనామార్చన, నీరాజనం, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఎస్.మూర్తి తెలిపారు. ఉదయం 9 గంటలకు రథసప్తమి వేడుకలు, 11 గంటలకు మహాసౌర హోమం, ఆంజనేయస్వామికి బడబానల స్తోత్రం, హనుమాన్ మూల మంత్రం, లాంగూలాస్త్ర స్తోత్రము, నాగవల్లీ దళార్చన తదితర పూజా కార్యక్రమాలు విశేషంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు.



అనకాపల్లి మండలం రాజుపాలెంలో సూర్యనారాయణమూర్తి ఆలయం



రాజుపాలెం ఆలయంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు

వేడుకగా సాయిబాబా తీర్థం



చింతలపాలెంలో సాయిబాబా ఆలయంలో పూజలు



తప్పెటగుళ్ల ప్రదర్శన తిలకిస్తున్న ప్రజలు

కశింకోట : మండలంలోని చింతలపాలెంలో ప్రసిద్ధి చెందిన సాయిబాబా తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. మండలంతోపాటు మునగపాక, యలమంచిలి మండలాలకు చెందిన గ్రామాల నుంచి కూడా ప్రజలు, మహిళలు వచ్చి ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలు ఎక్కువ సంఖ్యలో సాయిబాబాను దర్శించుకున్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. తీర్థంలో ఆట వస్తువులు, వంటింటి సామగ్రి, ఖర్జూరం, తిను బండారాలు వగైరా విక్రయాలు జోరుగా సాగాయి. పిల్లలు, పెద్దలు రంగుల రాట్నాలపై తిరుగాడారు. జారుడు బల్లలపై ఎక్కి ఆనందించారు. తప్పెటగుళ్లు, రేలా రేలారే, డాన్స్ బేబీ డాన్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతుల్ని అలరించాయి. సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్ కొట్టి రాము ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు కోన నాగేశ్వరరావు, సంతోష్, కొప్పాక గణేష్, మజ్జి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా దుకాణాలను తొలగించి అనకాపల్లి డీఎస్పీ సునీల్, ఎస్ఐలు ఎ.ఆదినారాయణరెడ్డి, జె.నాగేశ్వరరావు, తదితరులు తమ సిబ్బందితో పర్యవేక్షించారు.

జమున మృతి తీరని లోటు

తుమ్మపాల : ప్రముఖ తెలుగు చలనచిత్ర నటీమణి జమున(87) మరణంతో తెలుగు సినీ పరిశ్రమ ఒక గొప్ప నటిని కోల్పోయిందని సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం అన్నారు. పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. తెలుగు, తమిళ కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 198 చిత్రాల్లో వివిధ పాత్రలు పోషించి తనకు తానే సాటి అని నిరూపించుకున్నారని, ఉత్తమ నటిగా నంది అవార్డులు అందుకున్నారని కొనియాడారు. ఎన్టీఆర్ నేషనల్ అవార్డు, జాతీయ స్థాయిలో ఉత్తమ సహాయనటిగా పురస్కారాలు పొందారని తెలిపారు.

ఘనంగా తీర్థ మహోత్సవం



రంగులరాట్నంపై తిరుగుతున్న పిల్లలు, పెద్దలు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం పార్కు సెంటర్లో స్వర్గీయ కొణతాల మనోహరరావునాయుడు తీర్థ మహోత్సవం శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు నాయుడు విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ తీర్థ మహోత్సవంలో చిటికెలు, తప్పెటగుళ్లు, రంగులరాట్నాలు, టాయ్‌కార్ రేస్, జారుడు బల్లలు ఏర్పాటుతో సందడి చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల జాప్యంపై ఆందోళనొద్దు



దాడి రత్నాకర్

తుమ్మపాల : జగనన్న చేదోడు పథకానికి కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీలో ఆలస్యంపై అర్జీదారులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దారు సెలవులో ఉన్నందున కుల, ఆదాయ ధ్రువపత్రాల మంజూరుకు సమయం పడుతుందని, డిప్యూటీ తహసీల్దారు, సిబ్బంది ప్రత్యేక దృష్టితో సర్టిఫికెట్ల మంజూరుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 24, 25, 26 తేదీలలో అర్జీ చేసుకున్నవారికి 26న మంజూరు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా అర్హులైన వారందరికీ ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున ఈ నెల 30న నగదు జమచేయనున్నట్టు పేర్కొన్నారు.

రోడ్డు పునర్నిర్మాణం



కశింకోట-వెదురుపర్తి రోడ్డు పునర్నిర్మాణ పనులు

కశింకోట : కశింకోట-వెదురుపర్తి గ్రామాల మధ్య సుమారు రూ.రెండు కోట్లతో నిర్మిస్తున్న తారు రోడ్డు పునర్నిర్మాణ పనులు తాజాగా చేపట్టారు. గోతులతో అధ్వానంగా ఉన్న సిమెంట్ రోడ్డు పునర్నిర్మాణానికి రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నిధులను మంజూరు చేశారు. దీంతో రోడ్డును గతంలో చదును చేశారు. తాజాగా తారు రోడ్డు పనులు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు రోడ్డు పనులను పరిశీలించారు.

ఉచిత పశువైద్య శిబిరం



పశు వైద్యాధికారి అల్ఫోన్సా జార్జిని సత్కరిస్తున్న యువ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మారుతి

కశింకోట : ప్రపంచ జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా ఉచిత పశు వైద్య శిబిరాన్ని శుక్రవారం కశింకోటలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద యువ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు రేజేటి మారుతి వెంకటాచారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలలోని ఆవులను పరీక్షించి గర్భ కోశ వ్యాధుల నివారణకు మందులు అందించారు. పెయ్యిలకు నట్టల నివారణ మందులు, విటమిన్ ఇంజక్షన్లు ఇచ్చారు. శిబిరంలో సేవలందించిన కశింకోట పశు వైద్యాధికారి అల్ఫోన్సా జార్జి, సిబ్బందికి దుశ్శాలువాలు కప్పి ట్రస్టు వ్యవస్థాపకుడు మారుతి సత్కరించారు.

పశువుల అక్రమ తరలింపులో ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న పశువులు

కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామం వద్ద వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 17 పశువులను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు తెలిపారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. విజయనగరం జిల్లా గొట్లాం నుంచి హైదరాబాద్‌కు పశువులను తరలిస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. వీటిలో ఒకటి గేదె పెయ్యి కాగా, మిగిలినవి ఆవు పెయ్యిలని తెలిపారు. వీటిని స్వాధీనం చేసుకుని విజయనగరం జిల్లా కొత్తవలసలోని గోశాలకు తరలించామన్నారు. వీటిని తరలిస్తున్న ఆరీఫ్‌ఖాన్, ఫౌలురాజులను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సిలబస్‌పై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎంఈవో డి.దివాకర్

అనకాపల్లిటౌన్ : విద్యార్థుల పరీక్షలను దృష్టిలో పెట్టుకుని సిలబస్‌పై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో డి.దివాకర్ అన్నారు. స్థానిక వేల్పులవీధి బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం మండలంలోని హెచ్‌ఎంలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్ణీత సమయంలో సిలబస్‌ను పూర్తి చేయాలని, 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల వినియోగంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. నాడు-నేడు పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

రీ సర్వేతో రైతులకు ప్రయోజనం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

సబ్బవరం:ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా నిర్వహిస్తున్న సమగ్ర రీ సర్వేతో రైతులకు తమ భూములపై సంపూర్ణ హక్కు లభిస్తుందని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. సమగ్ర రీ సర్వే పై సబ్బవరం రెవెన్యూ పరిధిలోని రైతులతో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రీ సర్వేను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ, సర్వే సిబ్బంది భూములపైకి వచ్చినపుడు రైతులు తమ సాగులో ఉన్న భూముల వివరాలు కచ్చితంగా తెలియజేయాలన్నారు. ముందుగా గ్రామంలో భూములకు సంబంధించి నిజనిర్ధారణ జరుగుతుందన్నారు. రైతులు తమ సాగులో ఉన్న ఎస్ఎస్‌మెంట్ ల్యాండ్స్‌ను కూడా వారి పేరున నమోదు చేయడం జరుగుందన్నారు. ఈ సందర్భంగా సబ్బవరం రెవెన్యూ పరిధిలో రైతుల సాగులో ఉన్న ఇనాం,అగ్రహారం భూములు సర్వేచేసి పట్టాలు మంజూరు చేయాలని పలువురు రైతులు కోరారు. సబ్బవరం మండలంలో అగ్రహారం(ఇనాం భూములు),టీడీ ఇనాం భూములు సుమారు 600 నుంచి 700 ఎకరాల వరకూ రైతుల సాగులో ఉందని, పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బైలపూడి దేముడు, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు పల్ల కృష్ణ, పల్ల తాతారావు, కొటాన అప్పారావు,గొర్లి శ్రీను,దెడ్డం పద్మావతి,ఆర్ఐ వీరయ్య పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన శ్రీనివాసరావు

పరవాడ: స్థానిక జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నివాసం ఉంటున్న సంపతి శ్రీనివాసరావు(35) గురువారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పరవాడ సీఐ పి.ఈశ్వరరావు అందించిన వివరాలు..భార్య జ్యోతి, తల్లి వరలక్ష్మితో కలిసి 6 నెలలుగా కాలనీలో నివాసం ఉంటున్నాడు. వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్యతో మనస్పర్థలు రావడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. భార్య తనను విడిచివెళ్లిపోవడంతో మనస్థాపానికి గురైన శ్రీనివాసరావు గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి వరలక్ష్మి ఉదయం కుమారుడిని నిద్ర లేపేందుకు తలుపుకొట్టినా స్పందించలేదు. స్థానికుల సాయంతో తలుపు తీసి చూడగా ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడని తల్లి వరలక్ష్మి పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేస్తున్నామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

ప్రకటన

చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ లో Pending లో ఉన్న Garividi police station CC NO 26/13 CRNo 111/2012 U/s 417,380 IPC and Budarayavalasa police station CC no 57/13 CrNo 67/12 U/S 417,380 IPC

పై రెండూ కేసులలో ముద్దాయి ఆదిరెడ్డి అప్పారావు ఆరెడ్డి age 50years. కాశీపురం గ్రామం, దేవరాపల్లి మండలం, విశాఖపట్నం జిల్లా కోర్టు వాయిదాలకు హాజరు కానందున కోర్టువారు NBW ఇచ్చియున్నారు. అయినప్పటికీ ఆదిరెడ్డి అప్పారావు హాజరు కానందున, పరారీలో ఉన్నందున సదరు ఆదిరెడ్డి అప్పారావు 28.02.2023 (Not Less than 30 days) కేసు వాయిదాకు చీపురుపల్లి కోర్టులో ఉదయం 10.30 గం॥లకు హాజరు కావలసిందిగా Paper Publication రూపంలో తెలియపరచడమైనది.

ఇట్లు
SI Garividi
SI Budarayavalasa